స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 129 | ఆదివారం, సెప్టెంబర్ 27, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 129 | SUNDAY, SEPTEMBER 27, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్లాంట్ సామర్థ్యం పెంపునకు చర్యలు

• మూడేళ్లలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగు • రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల • ప్లాంట్‌కు నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు

2లో..

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

• ఆర్థిక సంస్కరణల రూపశిల్పికి భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయం • హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి • ప్రముఖ న్యాయవేత్తలు, ప్రజాప్రతినిధుల హాజరు • భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ఏర్పాటు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య):

పరిపాలనలో మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవన్న సీఎం రేవంత్ రెడ్డి భారతదేశం గర్వించదగిన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి మిగతా 2లో..



## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

• వీరనారికి సీఎం రేవంత్ ఘన నివాళులు
• ఆత్మగౌరవ పోరాట యోధురాలి స్మరణ
• అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం
• తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర

2లో..



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై

# బీఆర్ఎస్ కసరత్తు

• ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు • ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు బీఆర్ఎస్ ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీ.. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆరు జిల్లాల నేతలతో దశలవారీగా సమావేశమవుతున్న కేటీఆర్.. వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ శ్రేణుల కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా పని చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.

### 'గ్రాడ్యుయేట్లలో ప్రభుత్వంపై వ్యతిరేకత'

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో ఉందని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతో పాటు కుటుంబాలు, మిగతా 2లో..



## వీరనారి చాకలి ఐలమ్మకు

# ఘన నివాళులు

• కరీంనగర్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి • పోరాట స్ఫూర్తికి ప్రతీకగా ఐలమ్మ సేవలను కొనియాడిన మంత్రులు • యువతకు ఆదర్శంగా నిలిచిన మహనీయురాలు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మిగతా 2లో..

## పర్యాటక రంగానికి

# ఏఐతో కొత్త ఊపు

• కృత్రిమ మేధతో పర్యాటక రంగానికి కొత్త దిశ • భారీ పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం • 5లక్షల ఉపాధి అవకాశాలపై దృష్టి • ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సిఎం భట్టి



హైదరాబాద్, (వార్తా వేదిక సూర్య):

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణకు ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శిల్పారామంలోని సాంప్రదాయ వేదికలో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన 'డిజిటల్ అజెండా–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు' ప్రాధాన్యాన్ని భట్టి విక్రమార్క వివరించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, తెలంగాణ పర్యాటక విశేషాలను ప్రతిబింబించే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

### పర్యాటకానికి అపార అవకాశాలు

తెలంగాణలో వైద్య, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక మిగతా 2లో..



## ఎసిబి వలలో సిడిపిఓ

• రూ.63వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత • అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు లేకుండా ఉండేందుకు కేంద్రం నిర్వాహకులను వేదిస్తున్నట్లు ఆరోపణలు • జగిత్యాల జిల్లాలో కలకలం రేపిన సీడీపీఓ వ్యవహారం

2లో..



## ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం

• రూ.1,000 కోట్లతో 5,118 పంచాయతీ భవనాల నిర్మాణం • ఇప్పటికే 3,269 భవనాల పనులు 70 శాతం పూర్తి • హ్యామ్ రహదారుల పనులు గడువులోగా పూర్తి చేయాలి: మంత్రి సీతక్క

2లో..

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో

# పోటీ చేస్తాం: టీఆర్ఎస్ చీఫ్

• రేవంత్‌రెడ్డిది చేతగాని ప్రభుత్వం • విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం • అఫిడవిట్‌లో ఉన్న ఆస్తుల కంటే రూపాయి ఎక్కువ చూపించినా వారికే ఇచ్చేస్తా • తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో విఫలమైందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఏటా వేలాది మంది పసిపిల్లలు మృత్యువాత పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో నవజాత శిశువులు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కవిత.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులపై తనకు అందిన గణాంకాలు ఆందోళన కలిగించాయని తెలిపారు. 2020–21లో 6వేల మంది, మిగతా 2లో..



## ఆరోగ్యంపై శ్రద్ధతోనే దీర్ఘకాల చురుకుదనం: డీజిపి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య):

క్రీడా గాయాలు, క్యాన్సర్ చికిత్స, ప్రమాదాల అనంతరం వచ్చే నొప్పులకు సకాలంలో సరైన చికిత్స, నొప్పి నిర్వహణ అవసరమని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. జూబ్లీహిల్స్ నందిహిల్స్‌లో త్రైవ్ పెయిన్ క్లినిక్ వెల్‌నెస్ అండ్ మోర్‌ను ఎంపీ డీకే అరుణతో కలిసి ప్రారంభించారు. చిన్న నాటి నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ పెడితే వయసు పెరిగినా చురుకుగా ఉండొచ్చన్నారు. నొప్పి నిర్వ హణతో పాటు ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్, కన్జర్వేటివ్ థెరపీలను క్లినిక్‌లో అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమతుల ఆహారం, వ్యాయామం, ఫిజియోథెరపీతో ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని వైద్యులు సూచించారు.

https://epaper.vaarthavedikasurya.com
www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 129
ఆదివారం 27 సెప్టెంబర్, 2026



# పర్యాటక రంగానికి ఏఐతో కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణాన్ని కోరుకునే వారికి తెలంగాణ అనువైన ప్రాంతమని అన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో సమర్థంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

## పీపీపీ విధానంలో పెట్టుబడులు

గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పర్యాటకుల భద్రత, నాణ్యమైన వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క సూచించారు.

## ఐటీ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు'

వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ సంస్థల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలో సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు' అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటకం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని భట్టి విక్రమార్క అన్నారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ, తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో సీడీపీఓ

జగిత్యాల, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య): జగిత్యాల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక చర్యలో మెట్‌పల్లి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి దారోజు పద్మ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అధికారిక విధుల్లో అనుకూలత చూపేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. అవినీతి నిరోధక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణ మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేయాలని కోరినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలల కాలానికి సంబంధించి మొత్తం రూ.63 వేలుగా లంచం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేకంగా వలపన్ని చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కార్యాలయ ఆవరణ వెలుపల ఫిర్యాదుదారుడి నుంచి రూ.63 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాసేవలో ఉన్న అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనాలు పొందడం చట్టవిరుద్ధమని అవినీతి నిరోధక శాఖ పేర్కొంది. విధి నిర్వహణలో అనుకూలత చూపేందుకు లంచం డిమాండ్ చేయడం, స్వీకరించడం అవినీతి నిరోధక చట్టాల కింద నేరమని స్పష్టం చేసింది. ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. పట్టుబడిన అధికారిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు వెంటనే అవినీతి నిరోధక శాఖ ఉచిత సహాయ సంఖ్య 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా కూడా అవినీతి నిరోధక శాఖను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో కూడలిలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్వోన్నత న్యాయస్థానం మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశం గర్వించదగ్గ మహనీయుడని పేర్కొన్నారు. ఆర్థిక రంగంలో ఆయన అందించిన సేవలు భారతదేశ అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ దేశానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. పీవీ నరసింహారావు నాయకత్వంలోని ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడంలో కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి తెలిపారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన అనేక సంస్థలు సేవలందిస్తున్న హైదరాబాద్ ఆర్థిక ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయానికి సంబంధించిన చారిత్రక గుర్తింపును విగ్రహ ప్రాంగణంలో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ మరియు పునరావాస చట్టం వంటి కీలక నిర్ణయాలు దేశ సామాజిక అభివృద్ధికి దోహదపడ్డాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భూమిలేని పేదలకు కూడా హక్కులు కల్పించే విధంగా తీసుకొచ్చిన సంస్కరణలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. దేశ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలకు గుర్తింపుగా ఆయనకు భారత రత్న పురస్కారం ప్రకటించాలని ప్రధానిని కోరుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే ఆయన పేరుతో దేశ రాజధానిలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ముఖ్యమంత్రిగా తనకు గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

# చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆమెకు ఘన నివాళులు అర్పించారు. దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలిగా చాకలి ఐలమ్మను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ నిర్భయంగా పోరాడారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన ఉద్యమం తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని తెలిపారు. సామాన్య ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాటం కేవలం వ్యక్తిగత హక్కుల కోసం సాగిన ఉద్యమం కాదని, అది సామాజిక న్యాయం కోసం జరిగిన ప్రజా పోరాటమని ముఖ్యమంత్రి వివరించారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యసాహసాలు ప్రజల్లో చైతన్యం నింపాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె పాత్ర చారిత్రాత్మకమని గుర్తు చేశారు. దోపిడీ శక్తులకు ఎదురొడ్డి నిలిచిన చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. మహిళల సాధికారత, సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆమె చూపిన మార్గం నేటికీ ప్రాసంగికంగానే ఉందన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా ఉద్యమాల చరిత్రలో చాకలి ఐలమ్మకు విశిష్ట స్థానం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. అన్యాయానికి ఎదురొడ్డి నిలబడే ధైర్యం, హక్కుల కోసం పోరాడే సంకల్పం ఆమె జీవితం ద్వారా స్పష్టమవుతాయని అన్నారు. ప్రజల హక్కుల సాధనలో ఆమె చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవ విలువలను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. తెలంగాణ గడ్డపై పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ఆ వీరనారికి మరోసారి ఘన నివాళులు అర్పించారు.

# నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్లాంట్ సామర్థ్యం పెంపునకు చర్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించడంతో పాటు అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ మౌలిక వసతులను బలోపేతం చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్టలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను మంత్రి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో ఎఫ్ఎఫ్‌బీ (ఫ్రెష్ ఫ్రూట్ బంచ్) సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, నీటి లభ్యత, ప్లాంట్ నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలను మంత్రి, జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ప్లాంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 70 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎఫ్ఎఫ్‌బీని ప్రాసెస్ చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ప్లాంట్ గంటకు 30 టన్నుల సామర్థ్యంతో పూర్తిస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో భవిష్యత్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించనున్న నేపథ్యంలో నర్మెట్ట ప్లాంట్ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని గంటకు 120 టన్నుల వరకు పెంచుకునే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

## రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సౌకర్యం

నర్మెట్టలో ప్లాంట్ అందుబాటులోకి రావడంతో సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల ఆయిల్‌పామ్ రైతులకు సమీపంలోనే ఎఫ్ఎఫ్‌బీ ప్రాసెసింగ్ సదుపాయం లభిస్తోందని మంత్రి తెలిపారు. తోటల నుంచి పంటను త్వరగా ప్లాంట్‌కు తరలించుకునే అవకాశం ఉండటంతో రవాణా దూరం, సమయం, ఖర్చు తగ్గడంతో పాటు కోత అనంతరం సకాలంలో ప్రాసెసింగ్ చేసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. మంత్రి ఆయిల్‌పామ్ రైతులతో ముఖాముఖిగా మాట్లాడి సాగు అనుభవాలు, దిగుబడులు, కోతలు, ఎఫ్ఎఫ్‌బీ



సేకరణ, రవాణా, ప్రాసెసింగ్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. నంగునూర్‌కు చెందిన మడప ఎల్లారెడ్డి 5 ఎకరాల్లో 60 టన్నులు, మైసంపల్లికి చెందిన ఓరుగంటి రాజిరెడ్డి 3 ఎకరాల్లో 32.5 టన్నులు, వెంకటేశ్వరపల్లికి చెందిన పిన్‌రెడ్డి రాజిరెడ్డి 2.5 ఎకరాల్లో 9.6 టన్నులు, కూచినపల్లికి చెందిన బాపు రెడ్డి 3 ఎకరాల్లో 17 టన్నుల దిగుబడి సాధించినట్లు మంత్రికి వివరించారు. ఈ నలుగురు రైతులు కలిపి 13.5 ఎకరాల్లో 119.1 టన్నుల దిగుబడి సాధించినట్లు అధికారులు తెలిపారు.

## మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు విస్తరణ

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ ఎఫ్ఎఫ్‌బీ ఉత్పత్తి కూడా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు, సరైన పంట నిర్వహణ, తగిన నీటి యాజమాన్యం, సమయానుకూల కోతలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

## ప్లాంట్‌కు నిరంతర నీటి సరఫరా

నర్మెట్ట ప్లాంట్‌కు అవసరమైన నీటి లభ్యతపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ప్లాంట్‌కు నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తపాసుపల్లి రిజర్వాయర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ల నుంచి ప్లాంట్‌కు అవసరమైన నీటిని అందించే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లాంట్‌కు నిరంతర నీటి లభ్యత ఉంటే ఎఫ్ఎఫ్‌బీ ప్రాసెసింగ్‌కు అంతరాయం లేకుండా రైతుల నుంచి వచ్చే పంటను సకాలంలో ప్రాసెస్ చేయడానికి అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా నర్మెట్ట ప్లాంట్ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని భవిష్యత్‌లో పెంచుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎఫ్ఎఫ్‌బీ సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో పాటు రైతులకు అవసరమైన ప్రాసెసింగ్ మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తుమ్మల తెలిపారు. నర్మెట్ట ప్లాంట్ సిద్దిపేట జిల్లా, పరిసర ప్రాంతాల ఆయిల్‌పామ్ రైతులకు ముఖ్యమైన ప్రాసెసింగ్ కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు, ప్రాసెసింగ్ ప్లాంట్ అధికారులు, సిబ్బంది, ఆయిల్‌పామ్ రైతులు, పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

2022–23లో 4,933 మంది, 2024–25లో 3,853 మంది పసిపిల్లలు మృతి చెందినట్లు ఒక మిత్రుడు తనకు డేటా పంపించారని చెప్పారు. ఈ వివరాలు చూసిన తర్వాత రెండు రోజుల పాటు నిద్ర పట్టలేదన్నారు. హైదరాబాద్‌లోనే గత ఏడాది 1,046 మంది పిల్లలు మృతి చెందినట్లు ఆ డేటాలో ఉందని కవిత తెలిపారు. ప్రతి జిల్లాలోనూ గణనీయ సంఖ్యలో చిన్నారుల మరణాలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.

## 'వైద్యానికి కేటాయింపులు సరిపోవడం లేదు'

వైద్య రంగానికి బడ్జెట్‌లో 10 శాతం కేటాయిస్తామని చెప్పి సుమారు 5 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని కవిత ఆరోపించారు. గతేడాది రూ.13,192 కోట్లు కేటాయిస్తే రూ.9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. కేటాయించిన నిధుల్లోనే సుమారు రూ.3 వేల కోట్లు ఖర్చు చేయకుండా, ఆ తర్వాత మళ్లీ రూ.1,900 కోట్లు కేటాయించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ అంశంపై కాగ్ కూడా ప్రశ్నలు లేవనెత్తిందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని 11 ఆరోగ్య పథకాల్లో ఏడు పథకాలకు సున్నా బడ్జెట్ కేటాయించారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. నిమ్స్‌లో ముఖ్యమంత్రి చెబితే తప్ప పడక లభించని పరిస్థితి ఉందని, శస్త్రచికిత్స కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని కవిత ఆరోపించారు. నీలోఫర్ ఆసుపత్రిలో పడకలపై తీవ్ర ఒత్తిడి ఉందని, వైద్యులు, సిబ్బంది తమ శక్తికి మించి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

## 'ప్రతి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలిస్తాం'

ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన ఘటన తర్వాత ఇకపై ప్రతి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తామని కవిత ప్రకటించారు. ప్రజలు, యువత తమ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి, అవసరమైతే ఫొటోలు తీసి సమస్యలను ప్రశ్నించాలని కోరారు. కలెక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులు, సంక్షేమ హాస్టళ్లను ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పరిస్థితుల్లో మార్పు వస్తుందని అన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ఘటన జరిగిన సమయంలో మాత్రమే అధికారులు స్పందించడం సరిపోదని విమర్శించారు. విద్యారంగంలోనూ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని కవిత అన్నారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి ఉందని, బాలికలకు కనీస పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని పాఠశాలలను పరిశీలించాలని సూచించారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి, అవసరమైతే ప్రజల సహకారంతో వాటిని నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐటీడీఏలో నిధులు ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని ఆరోపించారు.

## 'ఆస్తులపై విచారణకు సిద్ధం'

తన ఫామ్‌హౌస్‌లో గజం భూమి కూడా కబ్జా భూమి లేదని కవిత అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా తన ఆస్తులు లేవని పేర్కొన్నారు. చట్టానికి లోబడే ప్రతి పైసా సంపాదించుకున్నానని, భవిష్యత్తులోనూ అదే విధంగా ఉంటానన్నారు. తన అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క రూపాయి ఎక్కువ ఆస్తి ఉన్నట్లు నిరూపించినా ఆ ఆస్తిని సంబంధిత వారికి ఇచ్చేస్తానని ప్రకటించారు. ప్రభుత్వం పరిపాలనలో విఫలమై డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, ఇతర కేసులపై ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసినా తదుపరి చర్యలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

## 'ఖైరతాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పోటీ'

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ తరఫున కచ్చితంగా పోటీ చేస్తామని కవిత ప్రకటించారు. ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతుందని అన్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చిన్నపాటి పొరపాట్లతో ఓట్లు తొలగిస్తున్నారని కవిత ఆరోపించారు. దీనివల్ల రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు భంగం కలుగుతుందన్నారు.

## 'సాగునీరు, తాగునీటిపై త్వరలో కార్యాచరణ'

ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఆసుపత్రులు 25 శాతం వైద్య సేవలను ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. సాగునీరు, తాగునీటి రంగాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నెరేళ్ల బాధితులకు ఎలాంటి న్యాయం చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులపై దాడి చేసిన పోలీసులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, ఎస్సీ కమిషన్ నివేదిక కూడా రాలేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై స్పష్టత ఇవ్వకుండా సభ నిర్వహిస్తే అది రాజకీయ కార్యక్రమంగానే మిగులుతుందని కవిత వ్యాఖ్యానించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

రైతులు, మహిళలు, యువత సహా వివిధ వర్గాల సమస్యలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని కేటీఆర్ అన్నారు. అయితే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో పనిచేయాలని పార్టీ నేతలకు సూచించారు.

## మరో మూడు జిల్లాల నేతలతో భేటీలు

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మరో రెండు రోజుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఆయా జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయి ఎన్నికల కార్యాచరణ, పార్టీ శ్రేణుల బాధ్యతలు, సమన్వయంపై చర్చించనున్నారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈసారి పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా విజయం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. అభ్యర్థి ఎవరైనా ఎన్నిక పార్టీ గుర్తుపైనే జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఐలమ్మకు ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

వాకిటి శ్రీహరితో కలిసి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు. అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచి ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఆమె జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమాన హక్కుల కోసం ఐలమ్మ సాగించిన ఉద్యమం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఆమె చూపిన మార్గం ఆదర్శప్రాయమని తెలిపారు. తెలంగాణ సమాజ నిర్మాణంలో ఆమె పాత్ర విశిష్టమని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు మరువలేనివని మంత్రి పేర్కొన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా ఆమె చూపిన పోరాట పటిమ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. యువత ఆమె జీవితాన్ని అధ్యయనం చేసి స్ఫూర్తి పొందాలని సూచించారు. బహుజన వర్గాల సాధికారతకు చాకలి ఐలమ్మ చేసిన కృషి అపారమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొనేలా కృషి చేయడం ఆమెకు నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు నివాళులు అర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా స్యాచురేషన్ విధానంలో నిర్మాణాలు చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రాష్ట్రంలో సొంత భవనాలు లేని 5,118 గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటికే 3,269 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ ఏడాదిలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు. ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్, అదనపు కలెక్టర్లు, సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, హ్యామ్ రహదారుల కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## 8 వేల గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు

గ్రామ పంచాయతీ భవనాలతో పాటు రాష్ట్రంలోని 8 వేల గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు. ఇందుకోసం రూ.800 కోట్ల నిధులు మంజూరు చేశామని, నిర్మాణ పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. సొంత భవనాలు అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలు తమ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణలో గ్రామీణ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని గ్రామీణ రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించనున్నామని, ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో చేపడుతున్న హ్యామ్ రహదారుల్లో సుమారు 50 శాతం ఈ నాలుగు జిల్లాల్లోనే ఉన్నందున అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపట్టాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు రహదారి నిర్మాణాలకు అనుకూల సమయం కావడంతో ఈ కాలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. హ్యామ్ విధానంలోని రహదారి నిర్మాణాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయని, తెలంగాణలో కాంట్రాక్టర్లు మంచి పనితీరు కనబరిస్తే ఇతర రాష్ట్రాల్లోనూ అవకాశాలు లభిస్తాయని సీతక్క తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని సీతక్క సూచించారు. ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు శాశ్వత ఆస్తులు సమకూరేలా పనులు చేపట్టాలన్నారు.



# రంగారెడ్డి



## పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకుల పంపిణీ

మంథని, సెప్టెంబర్ -26 ( వార్త వేదిక సూర్య )

మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన చిన్నారి తాటి సాయివర్ధన్ 5 వ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంతో ఘనంగా జరుపుకున్నారు. ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన పీసీ విజయకుమారస్వామి కుమారుడు చిన్నారి సాయివర్ధన్ పుట్టినరోజు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. శనివారం మంథని సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ చేతుల మీదుగా ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన 5 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 9 రకాల నిత్యవసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. బియ్యం, నూనె, పప్పు, కారం, మసాలా, చక్కెర, చాపత్త, సబ్బులు, టూత్ పేస్ట్, తదితర సరుకులను అందజేశారు.

ఈ సందర్భంగా సీఐ బుద్దే స్వామి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే చిన్నారికి సేవా గుణాన్ని నేర్పించడం అభినందనీయమని, తల్లిదండ్రులను కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. చిన్నారి తండ్రి తాటి విజయకుమారస్వామి (పీసీ విజయ్) మాట్లాడుతూ.. తన కుమారుడు సాయివర్ధన్ 5వ పుట్టినరోజు సందర్భంగా పేదలకు సహాయం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పుట్టినరోజు అంటే కేవలం కేక్ కట్ చేయడం, వేడుకలు చేసుకోవడం మాత్రమే కాకుండా, ఇతరులకు సహాయం చేసే గుణాన్ని చిన్నప్పటి నుండే నేర్పించాలనే ఉద్దేశంతోనే నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని అన్నారు. తమ కుమారుడు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని, సమాజ సేవలో ముందుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు

### షీ టీం ఎస్ ఐ లావణ్య

పెద్దపల్లి, సెప్టెంబర్ -26 ( వార్త వేదిక సూర్య )



రామగుండం సి.పి అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపెల్లి షీ టీమ్ వారు స్థానిక క్రీసెంట్ హై స్కూల్ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు. మహిళల భద్రత ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో,జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు , అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టీ - సేఫ్ అప్ వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ విజయ్ , ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు మౌనిక, స్నేహలత పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

మంథని, సెప్టెంబర్ -26 ( వార్త వేదిక సూర్య )



తెలంగాణ గడ్డపైన భూమికోసం భుక్తి కోసం బానిస బ్రతుకుల విముక్తి కోసం నిజాం రజాకార్ ఆకృత్యాలకు తొత్తులుగా ఉన్న జమిందార్, దొర గడీల అఘాయిత్యాలను సాయుధ పోరాటం ద్వారా అణిచివేసి పేద ప్రజల కు దొరల ఆధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పంచిపెట్టి వారి కన్నీళ్లను తుడిచిన చాకలి ఐలమ్మ గారి 131 జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించగా పట్టణ మాజీ అధ్యక్షులు బూడిద తిరుపతి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ జయంతి వేడుకల్లో జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ మాజీ అధ్యక్షులు చిలువేర సతీష్, సీనియర్ నాయకులు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సామల అశోక్,ఎడ్ల సాగర్, పట్టణ కార్యదర్శులు పార్వతి విష్ణు, మాచిడి శ్రీధర్, తదితరులు పాల్గొనడం జరిగింది

## వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శం: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 26, ( వార్త వేదిక సూర్య)

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గాజులరామారం చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో మాజీ శాసనసభ్యులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఇంద్రసేనారెడ్డి తొ పాటు రజక సంఘం నేతలు శివరాజ్, రాచకొండ బాలరాజు, యాదగిరి, సత్తయ్య, నరసింహ, రవి, రాచకొండ మురళి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే

### - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, సెప్టెంబర్ -26 ( వార్త వేదిక సూర్య )



మహనీయుల స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడు మహనీయుల ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు. అనాడే ముందుచూపుతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అర్టికల్ 3 పొందుపర్చారని, అంబేద్కర్ అర్టికల్ 3 రాసి ఉండకపోతే తెలంగాణ వచ్చేది కాదనే విషయాన్ని గమనించిన కేసీఆర్ ప్రపంచంలోనే 125అడుగుల అతిపెద్ద కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని అన్నారు. మన బావితరాల గురించి వందల ఏండ్ల క్రితమే ఆలోచన చేసి పోరాటాలు చేసిన చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొమురంభీంలాంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని చాటుకుంటున్నామని, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి విగ్రహాలను నెలకొల్పి స్మరించుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ పాలన నుంచి నేటి రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ పాలన వరకు మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి అణిచివేస్తున్నారని అన్నారు. ఈనాడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఇక్కడి విగ్రహానికి మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం పూలు వేయకపోవడం మహనీయులను అవమానపర్చడమేనన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ నేతృత్వంలో మంథనిలో మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి తన తండ్రినే మొక్కాలని చెప్తున్నాడని, మున్సిపల్ పాలకవర్గానికి సైతం మహనీయులు మీకు అవసరం లేదు మా తండ్రినే కొలువాలని చెప్పాడని ఆయన అన్నారు. ఒకవైపు ప్రభుత్వ పరంగా మహనీయకుల జయంతి వర్ధంతిలు జరుపుకుంటున్న క్రమంలొ మంథనిలో మాత్రం మహనీయులకు కనీస గౌరవం ఇవ్వకుండా తన తండ్రినే మొక్కమని చెప్తున్నాడని ఆయన విమర్శించారు. తన తండ్రి చరిత్ర ఏంటో చెప్పడం లేదన్నారు. మహనీయుల గురించి ఆలోచన చేయకుండా ఎమ్మెల్యే మాటలు విని స్తానిక పాలకవర్గ కనీసం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలు వేయకపోవడాన్ని ఖండిస్తున్నానని అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాకలి ఐలమ్మను గొప్పగా గౌరవించుకుంటామని, ఎన్ని అంటకాంలు పెట్టినా వాళ్ల చరిత్రనే చాటి చెప్తామన్నారు. మహనీయుల విగ్రహాలు ఎక్కడ ఉన్నా గౌరవించాలనే కలెక్టర్ ఆలోచన చేయకపోవడం బాధకరమన్నారు. మంథని ఎమ్మెల్యే ఓట్ల కోసమే మా సమాజాన్ని వాడుకుంటున్నడే కానీ మహనీయులను గౌరవించడం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఈనాడు చాకలి ఐలమ్మను గౌరవించకపోవడం చీకటి పాలన, చీకటి ఆలోచనకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు





### కాలినడకన, ఆటోలో తిరుగుతూ ఊరేగింపులను పర్యవేక్షించిన జగ్గారెడ్డి

### సాయంత్రం 4 గంటలకు మొదలుకుని తెల్లవారుజామున 6 గంటల వరకు స్వయంగా నిమజ్జన వేడుకలను పర్యవేక్షించిన జగ్గారెడ్డి

### సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల పక్షాన రూ 21 లక్షలకు చైతన్య యువజన సంఘం లడ్డూ ను వేలం లో దక్కించుకున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, వార్త వేదిక సూర్య, సెప్టెంబర్ 26:

సంగారెడ్డి పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వినాయక విగ్రహాల ఊరేగింపులను జగ్గారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఊరేగింపు మార్గాల్లో కాలినడకన, ఆటోలో తిరుగుతూ పరిస్థితులను పరిశీలించిన జగ్గారెడ్డి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా తనదైన శైలిలో చర్యలు చేపట్టారు. పోలీసు, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించారు. నిమజ్జనోత్సవాల్లో జగ్గారెడ్డి తన భార్య నిర్మల, కుమార్తె జయ చైతన్య రెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. భక్తులతో మమేకమవుతూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమాలను శనివారం తెల్లవారుజామున 6 గంటల వరకు కింది బజార్ చెరువు వద్ద జగ్గారెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వినాయక విగ్రహాలు వరుసగా నిమజ్జనం అయ్యేలా అధికారులు, నిర్వాహకులతో సమన్వయం చేశారు.

**రూ.21 లక్షలకు లడ్డూ వేలం**

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల పక్షాన చైతన్య యువజన సంఘం నిర్వహించిన లడ్డూ వేలంలో జగ్గారెడ్డి పాల్గొని రూ. 21 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. నియోజకవర్గ ప్రజల తరఫున ఈ లడ్డూను వేలంలో పొందినట్లు ఆయన తెలిపారు. నిమజ్జన వేడుకల్లో ప్రముఖ గాయకుడు జంగి రెడ్డి ఆలపించిన భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, బ్యాండ్ ట్రూప్స్ ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధుల్లో భక్తుల సందడి నెలకొనగా, ఉత్సవ వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి.

# మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ప్రతీక వీర వనిత చాకలి ఐలమ్మ

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్ -26 ( వార్త వేదిక సూర్య )



వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,,, చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పేదలు, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.

దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారు. అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శం" అని కలెక్టర్ పేర్కొన్నారు.

సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఏం. రవీందర్, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంక్ కు తెలంగాణ గవర్నమెంట్ బెస్ట్ కోఆపరేటివ్ బ్యాంక్‌గా అవార్డు రావడం అభినందనీయం

### రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురం రెడ్డి

కూకట్ పల్లి, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య) :




వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంక్ రెండవ సంవత్సర వార్షికోత్సవ సందర్భంగా జీడిమెట్ల లోని శుభం హోటల్లో చైర్మన్ రామారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ చైర్మన్ రామారావు ఎంతో కష్టపడి డిపాజిట్ సేకరించి కస్టమర్లను అధిక సంఖ్యలో లోన్లు ఇచ్చి రికవరీ చేయడంలో ఎంతో ముందున్నారని అన్నారు. రామారావు మహిళలకు 90% లోన్ ఇచ్చి వాళ్ళ అభివృద్ధికి తోడ్పడుతూ వారి కుటుంబాలను అభివృద్ధి చెందాలని బ్యాంకు లోన్లు ఇవ్వడం జరుగుచున్నదని తెలిపారు. కస్టమర్లతో మంచి పేరు సంపాదించి వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంకు ను ఎంతో అభివృద్ధి తీసుకురావడం జరిగింది. రెండు సంవత్సరాలలోనే సుమారు 5000 మంది కస్టమర్లు సంపాదించుకున్నారని అన్నారు. ఈ సంవత్సరం తెలంగాణ గవర్నమెంట్ బెస్ట్ కోఆపరేటివ్ బ్యాంకుగా అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంకు దినదిన అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా చైర్మన్ రామారావు కి, వారి సిబ్బందికి, వచ్చిన డిపాజిటర్లు, కస్టమర్లు, డైరెక్టర్లకు పేరుపేరునా జే పురంధర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## లక్ష్మణ్ బాపూజి జయంతి కమిటి కన్వీనర్ గా జాతీయ చేనేత అధ్యక్షులు - డాక్టర్ చిక్క దేవదాసు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 26(వార్త వేదిక సూర్య)



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి ఉత్సవాల కమిటి కన్వీనర్ గా జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు నియమతులయ్యారు. ఈ మేరకు శనివారం బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బలమా యదేవి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారంగా నిర్వహిం చనుంది. ఉత్సవాల నిర్వహణ బాధ్యత లను దేవదాసు పర్యేక్షించనున్నారు.

## ఘనంగా మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ 104వ దినోత్సవం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 26(వార్త వేదిక సూర్య)



మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ (ఎంఈఎస్) 104వ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు సందడి చేశాయి. చిన్నారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే ఎం ఈ ఎస్ డే సందర్భంగా ఆర్మీ అధికారులు, సివిల్ అధికారులు, స్థానిక ఉద్యోగుల మధ్య వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, క్యారం బోర్డ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కమాండర్ వర్క్స్ ఇంజనీర్స్ అధికారులు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు పరస్పరం ఎం ఈ ఎస్ డే శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో జి ఈ సౌత్, జి ఈ నార్త్, జి ఈ గోల్కొండ, సి డబ్ల్యూ ఈ-1, డబ్ల్యూ ఈ-2 అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 2వ వార్షికోత్సవ వేడుకలు.

కూకట్ పల్లి, సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య) :

వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 2వ వార్షికోత్సవ వేడుకలు శనివారం షాపూర్ నగర్ లోని శుభం హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, సిబ్బంది, డైరెక్టర్లు, శ్రేయోభిలాషులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

24 ఆగస్టు 2024న ప్రారంభమైన వాసుదేవ్ సొసైటీ తన రెండేళ్ల ప్రయాణంలో సాధించిన ప్రగతి, సభ్యులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను ఈ సందర్భంగా వివరించింది.

**వాసుదేవ్ సొసైటీకి "ఉత్తమ సొసైటీ" అవార్డు**

వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యమైన ఘట్టంగా తెలంగాణ ప్రభుత్వ సహకార సంఘాల శాఖ ద్వారా వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడకు "ఉత్తమ సొసైటీ" అవార్డు లభించిన విషయాన్ని వెల్లడించారు. సొసైటీ పనితీరు, సభ్యులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడం వాసుదేవ్ సొసైటీకి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

ఈ అవార్డు సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, సభ్యులు, శ్రేయోభిలాషుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని యాజమాన్యం పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ సహకార సంఘాల శాఖతో పాటు సంబంధిత సహకార శాఖ అధికారులు అందించిన ప్రోత్సాహానికి సొసైటీ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. ఈ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ కావూరి రామారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీడిమెట్ల సిఐ కె రవికుమార్, డి ఎండ హెచ్ ఓ కావూరి మల్లికార్జునరావు, ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామారావు, కోస్టల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ టి ఈశ్వరచంద్ర రావు, ఇండస్ట్రియలిస్ట్, ఎబిలిటీ ఇంజినీరింగ్ ఆదినారాయణ, జాగృతి అర్బన్ బ్యాంక్ ప్రొఫెషనల్ డైరెక్టర్ శ్రీరామ్ బాబుజి, రామకృష్ణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి లు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**వాసుదేవ్ సొసైటీ ప్రగతి ప్రస్థానం**

వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సభ్యుల్లో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం, అవసరమైన సమయంలో సభ్యులకు రుణ సదుపాయాలను అందించడం అనే లక్ష్యాలతో ప్రారంభమైంది. ప్రారంభమైన రెండు సంవత్సరాల వ్యవధిలోనే సొసైటీ తన కార్యకలాపాలను క్రమంగా విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం సొసైటీకి దాదాపు 5,000 మంది సభ్యులు, సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు. జీడిమెట్ల, ఉప్పల్, రాంపల్లి క్రాస్ రోడ్, కూకట్ పల్లి, శంషాబాద్ ప్రాంతాల్లో శాఖల ద్వారా సభ్యులకు సేవలు అందిస్తోంది. సభ్యుల అవసరాలకు అనుగుణంగా సేవింగ్స్ అకౌంట్లు, ఫిక్స్డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, మంత్లీ ఇన్కమ్ స్కీమ్, రుణ సదుపాయాలు వంటి వివిధ ఆర్థిక సేవలను అందిస్తోంది. ఈ సందర్భంగా వాసుదేవ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ కావూరి రామారావు మాట్లాడుతూ, వాసుదేవ్ సొసైటీకి లభించిన "ఉత్తమ సొసైటీ" అవార్డు ఒక్కరి కృషికి సంబంధించినది కాదని, ఇది సభ్యులు, డైరెక్టర్లు, సిబ్బంది, శ్రేయోభిలాషుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని అన్నారు. సభ్యులు తమపై ఉంచిన నమ్మకం, విశ్వాసమే వాసుదేవ్ సొసైటీ అభివృద్ధికి ప్రధాన బలమని తెలిపారు. వాసుదేవ్ సొసైటీ లక్ష్యం కేవలం ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం మాత్రమే కాదని, సభ్యుల ఆర్థిక అవసరాలకు అండగా నిలిచి, పొదుపును ప్రోత్సహించి, పరస్పర సహకారంతో సమిష్టి ఆర్థిక అభివృద్ధికి బలమైన వేదికగా సొసైటీని తీర్చిదిద్దడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు**

రాబోయే రోజుల్లో వృత్తిపరమైన నిర్వహణ, మెరుగైన సభ్య సేవలు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత సేవలు, బాధ్యతాయుతమైన రుణ విధానాలు, సేవా విస్తరణ ద్వారా సొసైటీని మరింత బలోపేతం చేయాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. పారదర్శకత, మంచి పాలన, నిబంధనల పాటింపు, సభ్యుల విశ్వాసం ప్రధానంగా తీసుకుని స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని యాజమాన్యం తెలిపింది. 2వ వార్షికోత్సవం సందర్భంగా సభ్యులు, సిబ్బంది చేసిన సేవలను గుర్తించి అభినందించారు. సొసైటీ భవిష్యత్ ప్రణాళికలను కూడా ఈ సందర్భంగా వివరించారు.

**వాసుదేవ్ ప్రస్థానంలో మరో మైలురాయి**

తెలంగాణ ప్రభుత్వ సహకార సంఘాల శాఖ నుండి లభించిన "ఉత్తమ సొసైటీ" అవార్డు వాసుదేవ్ సొసైటీ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని యాజమాన్యం పేర్కొంది.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 129
ఆదివారం
27 సెప్టెంబర్ 2026





## ప్రగతి నగర్‌లో ఘనంగా కూచిపూడి నృత్య ప్రదర్శన

**హయత్‌నగర్ సెప్టెంబర్ 27 :- (వార్త వేదిక సూర్య)**

హయత్ నగర్ లోని ప్రగతి నగర్ కాలనీ ఫేజ్--2 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సాయి కూచిపూడి నిత్యనికేతన్ నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు, యువ కళాకారులు సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో కళాకారులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనలో కళాకారుల హావభావాలు, లయ, తాళం, అభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి హాజరైన కాలనీ వాసులు, తల్లిదండ్రులు కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలను, ముఖ్యంగా కూచిపూడి నృత్యాన్ని భావితరాలకు పరిచయం చేసి, చిన్నారుల్లో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, తల్లిదండ్రులకు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి ప్రదర్శనతో ప్రగతి నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## బాపూజీ 111వ జయంతి వేడుకలకు ప్రజలంతా తరలిరావాలి

### పద్మశాలి సంఘం అధ్యక్షులు - మంద జగన్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 26(వార్త వేదిక సూర్య)**



తెలంగాణ రాష్ట్ర సాధన, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 27 (2026) ఆదివారం ఉదయం 10:00 గంటలకు లక్డికపూల్ రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ వార్డు మెంబర్ సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు సికింద్రాబాద్ ఎస్సి ఎస్టి బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ తెలిపారు. కావున పద్మశాలి కుల బాంధవులు, ప్రజలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంద జగన్ పిలుపునిచ్చారు.

## శంషాబాద్‌లో వ్యక్తి అదృశ్యం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ (56) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 24న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సెప్టెంబర్ 25న ఉదయం మనోజ్ కుమార్‌తో కలిసి పనిచేసే నరేష్‌ను కుటుంబ సభ్యులు విచారించగా, సెప్టెంబర్ 24న రాత్రి 8.50 గంటల సమయంలో పాలమాకులలోని తిరుమల వైన్స్ వద్ద మనోజ్ మద్యం సేవించి మత్తులో ఉన్నట్లు తెలిపాడు. ఇంటి వద్దకు తీసుకెళ్లి వదిలేస్తామని చెప్పగా, తానే ఇంటికి వెళ్లిపోతానని మనోజ్ చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నరేష్ తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదృశ్యమైన మనోజ్ కుమార్ ఎత్తు సుమారు 4 అడుగుల 8 అంగుళాలు, చామనచాయ రంగు కలిగి ఉంటాడని, అదృశ్యమైన సమయంలో బ్లూ టీషర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలడని పేర్కొన్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులకు ఎవరిపైనా అనుమానం లేదని పోలీసులు తెలిపారు. మనోజ్ కుమార్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన సమాజం

### కోటి విద్యా స్కూల్లో ఘనంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



శ్రీరామ కాలనీ లోని కోటి విద్యా స్కూల్లో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై నాటక రూపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పొందుతూ ఆరోగ్యంగా జీవించవచ్చని విద్యార్థులు చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం




### : కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, దొరల గడీలను బద్దలుకొట్టిన వీరవనిత, బహుజన బిడ్డ చాకలి (చిట్యాల) ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని కాటేదాన్ మరియు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ నేతృత్వంలో ముఖ్య నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ?ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన ఐలమ్మ, నాటి నిజాం పాలనలో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. “మన భూమి, మన భుక్తి కోసం దొరలకు కప్పం ఎందుకు కట్టాలి?” అని ప్రశ్నిస్తూ, ప్రాణాలకు తెగించి తన పొలంలో పండిన ధాన్యాన్ని దొరల పాలు కాకుండా కాపాడుకున్న ధీరవనిత ఐలమ్మ అని గుర్తుచేశారు. ?ఆమె రగిలించిన పోరాట స్ఫూర్తి చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించి, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి బలమైన పునాది వేసిందన్నారు. పీడిత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె ఒక దిక్సూచిగా నిలిచారని.. మహిళలు అబలలు కారు, తిరగబడితే భద్రకాళీగా మారగలరని నిరూపించిన మహోన్నత శక్తి ఐలమ్మ అని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించడంలో ఆమె చూపిన తెగువ, ఆత్మస్థైర్యం నేటి తరానికి ఎంతో ఆదర్శమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్. వెంకటయ్య, అక్యాం రాఘవేందర్ యాదవ్, మైసిరెడ్డి బాలరాజు యాదవ్, ఎస్. అశోక్ కుమార్, రామస్వామి, కొంపల్లి జగదీష్, జంపుల భగవాన్ దాస్, సునీల్, పద్మ, పుష్ప రాజు, చికెన్ మోహన్, శేఖర్, సూరి, నాని, అఖిల్, తుకారం, గడ్డం మహేష్‌లతో పాటు పలు కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కండేయనగర్‌లో గణనాథుడి లడ్డూకు విశేష స్పందన

### - రూ.77 వేలతో లడ్డూను కైవసం చేసుకున్న కృష్ణ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ డివిజన్ మార్కండేయనగర్ కాలనీలో బస్తీ కమిటీ, నవోదయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాటకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన వేలం పాటలో కృష్ణ రూ.77 వేలకు గణనాథుడి లడ్డూను కైవసం చేసుకున్నారు. భక్తితో లడ్డూను దక్కించుకున్న కృష్ణ కుటుంబంపై గణనాథుడి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని బస్తీ కమిటీ పెద్దలు ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాల్లో కాలనీ ప్రజలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలను చాటుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, భక్తి, సేవా స్ఫూర్తిని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ పెద్దలు ఏర్వ సత్యనారాయణ, వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ గద్దె కృష్ణ, పొదుపు సంఘం అధ్యక్షుడు పగడిమర్రి సూర్యనారాయణ, బస్తీ కమిటీ అధ్యక్షుడు విడెం రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, గద్దె యాదగిరి, మునిగపాటి విష్ణు, మామిడి శెట్టి శ్రీనివాస్, కైరం కొండ శంకర్, తిరునగర్ లక్ష్మణ్, శిరందాసు నరేందర్, యాంజల మహేష్ రాజ్, ముషం నరేష్, లింగం, ధనంజయ, నవోదయ యూత్ అధ్యక్షుడు కోట పవన్, భానుచందర్, విజయ్ యాదవ్, మధు గౌడ్, కుమ్మరి నరేందర్, శశిరాజ్, లలీప్ యాదవ్, శివ, పారేపల్లి నరసింహతో పాటు మహిళలు, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని జయప్రదం చేయండి

### -27న రవీంద్రభారతిలో ఘనంగా వేడుకలు

### -హాజరు కావాలని పిలుపునిచ్చిన ఉత్సవ సమితి వైస్ చైర్మన్ అంబటి శ్రీనివాస్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**




సమాజంలో సమానత్వం, బహుజనాల ఆత్మగౌరవమే నా జీవిత లక్ష్యం” అని చాటిచెప్పిన మహోన్నత స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ జాతిపిత శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవ సమితి వైస్ చైర్మన్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం స్టేట్ యూత్ ప్రెసిడెంట్ అంబటి శ్రీనివాస్ తెలిపారు. ?ఈ మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన గొప్ప అమరజీవి, ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. బహుజన నాయకులు, పద్మశాలి సంఘాల సమక్షంలో నిర్వహించే ఈ జయంతి వేడుకలను ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 27 న ఆదివారం ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్ లో తెలంగాణ సమాజం కోసం, బహుజనుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన బాపూజీ సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ వేడుకలకు బహుజన శ్రేణులు, పద్మశాలి బంధువులు, తెలంగాణ ఉద్యమకారులు మరియు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన హృదయపూర్వకంగా కోరారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన బిడ్డ, దొరల గడీలను బద్దలుకొట్టిన ధీర వనిత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) 131వ జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంషాబాద్ సిద్ధాంతి వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన ఐలమ్మ నాటి నిజాం పాలనలో భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని కొనియాడారు. “నా భూమి.. నా పంట.. దొరలకు ఎందుకు కట్టాలి?” అంటూ తన పొలంలో పండిన ధాన్యాన్ని దొరల పాలు కాకుండా ప్రాణాలకు తెగించి కాపాడుకున్న వీర వనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.ఐలమ్మ రగిలించిన పోరాట స్ఫూర్తి చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించి, నిజాం వ్యతిరేక సాయుధ పోరాటానికి బలమైన పునాది వేసిందని తెలిపారు. పీడిత ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆమె ఒక దిక్సూచిగా నిలిచారని పేర్కొన్నారు.మహిళలు అబలలు కారు.. తిరగబడితే రణచండిలా మారగలరని నిరూపించిన మహోన్నత శక్తి చాకలి ఐలమ్మ అని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించడంలో ఆమె చూపిన తెగువ, ఆత్మస్థైర్యం నేటి తరానికి ఎంతో ఆదర్శమని, ఆమె ఆశయాలను కొనసాగించడమే ఐలమ్మకు అర్పించే నిజమైన నివాళి అని ప్రకాష్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శం

### - తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్ర అనిర్వచనీయం: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిం దన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం మరింత బలోపేతమైందని, ఫలితంగా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు.చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1895లో జన్మించి 1985లో మరణించిన చాకలి ఐలమ్మ తన జీవితంలో ఎన్నో కష్టాలు, అణచివేతలను ఎదుర్కొంటూ ప్రజల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ అధికారులు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు







## ప్రజా సమస్యల పరిష్కారానికి నారగూడెం మల్లారెడ్డి వినతి

### - పెద్ద తాళ్లకుంటలో బతుకమ్మ నిమజ్జన ఘాట్.. పాండురంగ్ నగర్ వరకు ఫుట్‌పాత్‌ల అభివృద్ధి కోరుతూ జీహెచ్ఎంసీకి వినతిపత్రం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**

రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.హైదర్గూడ డివిజన్ పరిధిలోని పెద్ద తాళ్లకుంట (బతుకమ్మ కుంట)లో డ్రైనేజీ నీరు చేరి మురికిగా మారిందని, బతుకమ్మ నిమజ్జన సమయంలో మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. కుంట వద్ద శాశ్వత నిమజ్జన ఘాట్ ఏర్పాటు చేయడంతో పాటు బోరు, లైటింగ్, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. నిమజ్జన ప్రాంతాన్ని శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పిల్లర్ నంబర్ 143, గోల్డెన్ ప్యాలెస్ హోటల్ నుంచి చిన్న అనంతగిరి శివాలయం మీదుగా పాండురంగ్ నగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. ఫుట్‌పాత్‌లపై చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొడవైన గడ్డి పెరగడంతో దుర్వాసన, దోమల బెడద పెరిగిందన్నారు. దీంతో స్థానిక ప్రజలు, శివాలయానికి వచ్చే భక్తులు, కాలినడకన వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫుట్‌పాత్‌లను తక్షణమే శుభ్రం చేసి ఇంటర్‌లాకింగ్ టైల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో చెత్త వేయడాన్ని నియంత్రించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా, సుందరంగా మారుతాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం, భద్రత, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు రెండు సమస్యలపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని నారగూడెం మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె. కిరణ్ చారి, ఎస్. విజయ్ కుమార్, కె. కృష్ణ, డి. సత్యనారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో జోనల్ కమిషనర్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని హైదర్‌గూడ డివిజన్ పెద్ద తాళ్లకుంటలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## రజక సోదరుల ఆత్మగౌరవానికి ప్రతీకగా చాకలి ఐలమ్మ విగ్రహం

### - సొంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శేఖర్ ముదిరాజ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కిస్మత్‌పూర్ ఆరే మైసమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.రజక సోదరుల కోరిక మేరకు, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచేలా కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు శేఖర్ ముదిరాజ్ తన సొంత ఖర్చులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సమాజం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, వారి త్యాగాలను స్మరించు కోవాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు శేఖర్ ముదిరాజ్ తెలిపారు.చాకలి ఐలమ్మ పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి అని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ప్రభుత్వ నిధులు లేదా ఇతరుల సహాయం లేకుండా తన సొంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఆరే మైసమ్మ చౌరస్తాలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు కావడం పట్ల రజక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ విగ్రహం కేవలం జ్ఞాపక చిహ్నంగా కాకుండా, ఐలమ్మ ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని భావితరాలకు గుర్తుచేసే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు.విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజలు, రజక సోదరులు, మహిళలు, యువత, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు భీమార్జున రెడ్డి, మహాలింగం, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగేష్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మహేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు నరేష్ యాదవ్, పవన్ సాయి, ఎస్. శ్రీనివాస్, నాగరాజు, స్వామి, గణేష్, ఈగ లక్ష్మణ్, కిరణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ రజక సంఘం అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు నీలగిరి రాజ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు పరుపుగళ్ల రాజు, యాదయ్య, వెంకటేష్, కిషన్, శ్రీనివాస్, సంతాపురం బాలరాజ్, నీలగిరి భరత్‌తో పాటు రజక సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :**

వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌర్ణిమ సందర్భంగా నిర్వహిస్తున్న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం భాద్రపద మాసం పౌర్ణిమ శనివారం మణికొండ డివిజన్ మర్రిచెట్టు సమీపంలోని శివాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని సమకూర్చారు. పూజారి మండువ మధుసూదన్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారి కుంకుమార్చన, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకులకు ప్రీతిపాత్రమైన ధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.వ్రత కార్యక్రమంలో స్థానికులు, స్థానికేతరులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సామూహికంగా వ్రతం నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక తృప్తి కలిగిందని పలువురు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు, దిలీప్ కక్కడ, సుమ నలిని, హరి హరనాథ్ రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 129
ఆదివారం
27 సెప్టెంబర్ 2026



## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన పోలీస్ సిబ్బందికి క్రీడా సామాగ్రి పంపిణీ

### జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఐపిఎస్

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :

తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28 నుండి 30 వరకు క్లస్టర్ సి భాగంలో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీలకు నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ తరపున ఎంపికైన పోలీస్ సిబ్బందికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు విజయాన్ని, మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, ఎంపికైన క్రీడాకారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల కరపత్రాలు ఆవిష్కరణ

### సెప్టెంబర్ 30 చివరి తేదీ

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 26 ( వార్త వేదిక సూర్య ) :




నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సార్వత్రిక అధ్యయన కేంద్రం ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్, అధ్యయన కేంద్రం సమన్వయకర్త అంజయ్య తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటర్మీడియట్, ఐటీఐ లేదా ఏదైనా రెండేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలో చేరేందుకు అర్హులని వారు తెలిపారు. ఉద్యోగాలు, ఇతర కారణాలతో చదువును కొనసాగించలేకపోయిన వారు, గృహిణులు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న వారు నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7382929779 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

### జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 26 (వార్త వేదిక సూర్య ) :




నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపిఎస్ అధికారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, అన్యాయంపై ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ భూమినాది పండించిన పంటనాది..తీసుకెళ్లడానికి దొరెవ్వడు...నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రటైతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య, ఆర్ఐ జగన్, ఎస్ఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీలతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు అందించాలి..

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ నూతన చైర్మన్‌గా కేఎస్ రవికుమార్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణయ్య, కోశాధికారిగా జి. రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రెడ్‌క్రాస్ తక్షణ సహాయం అందించాలని అన్నారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య సేవలు, ఇతర సామాజిక కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులతో పాటు నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు --

### విగ్రహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం...

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

తెలంగాణ సాయుధ పోరాటంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.

భూస్వామ్య వ్యవస్థ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం, తెగువ, ఆత్మవిశ్వాసం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీనివాస్ యాదవ్, మైత్రి యాదయ్య, రమేష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వీర్లపల్లి శంకర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల ఆత్మగౌరవ పోరాటానికి చాకలి ఐలమ్మ ఒక ప్రతీకగా నిలిచారని అన్నారు.

భూమి, భుక్తి, సామాజిక గౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని తెలిపారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి



కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల సంక్షేమం, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ఈ వేడుకల్లో మాజీ ఎంపీ వి. హన్మంతరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు పారిజాత, బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ అజయ్, వైస్ చైర్మన్ బంగారు బాబు, ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే షాద్‌నగర్ రజక సంఘం నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం



### మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య దోపిడీ, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ నేలపై దొరల పెత్తనం, గడీల అహంకారానికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. తన భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు అన్యాయాన్ని ప్రశ్నించి తమ హక్కుల కోసం ముందుకు రావడానికి ఐలమ్మ జీవితం స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఆమె త్యాగాలు, పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజల రెడ్డి, కార్పొరేటర్ అవేజ్, మున్సిపల్ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

## జడ్చర్ల అభివృద్ధికి రూ.12.50 కోట్ల నిధులు

### రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శ్రీకారం

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

జడ్చర్ల పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.12.50 కోట్ల నగర అభివృద్ధి నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శనివారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులతో పాటు 11వ వార్డులో సుమారు రూ.2 కోట్ల మూడ నిధులతో చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జడ్చర్ల మున్సిపాలిటీలోని ప్రతి వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

జడ్చర్ల నుంచి మూడ కు సమకూరుతున్న నిధులకు అనుగుణంగా పట్టణానికి మరింత వాటా దక్కాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కేటాయింపులను పెంచి జడ్చర్లకు 50 శాతం మూడ నిధులు కేటాయించేలా సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి కోరనున్నట్లు తెలిపారు. ఖమ్మంలో అమలవుతున్న 50



శాతం కేటాయింపు విధానాన్ని జడ్చర్లకు కూడా వర్తింపజేయాలని కోరనున్నట్లు చెప్పారు.

**సరస్వతి నగర్ సమస్యకు పరిష్కారం...**

సరస్వతి నగర్ డీటీసీపీ లేఅవుట్‌లోని ప్లాట్ల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎన్ ఓ సి ఇప్పించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జడ్చర్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.



## రక్తదానం మహాదానం.. యువత ముందుకు రావాలి

### పాలేపల్లి శిల్పా మెడికేర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

పాలేపల్లి శిల్పా మెడికేర్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ శాఖ చైర్మన్ లయన్ నటరాజ్, జడ్చర్ల ప్యాట్రన్ మెంబర్ రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదాతలను వారు అభినందించారు. లయన్ నటరాజ్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఒకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో కీలకమని అన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే రక్తం ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధితులకు తరచూ రక్తం అవసరమవుతుందని, అలాంటి వారికి రక్తదాతలు అండగా నిలవడం అభినందనీయమన్నారు. యువతలో రక్తదానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.జడ్చర్ల ప్యాట్రన్ మెంబర్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ వెల్లయన్ కరుప్పయ్య, ప్లాంట్ హెడ్ సునీల్, క్వాలిటీ హెడ్ ఈశ్వర్, హెచ్‌ఆర్ అడ్మిన్ ఆంజనేయులు, సంస్థ సిబ్బంది, రెడ్ క్రాస్ డాక్టర్ శ్రీకర్, టెక్నీషియన్లు కృష్ణవేణి, రాములు, స్టాఫ్ నర్స్ సునీతతో పాటు పరుశురాం, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సిబ్బంది రక్తదాన ప్రక్రియను పర్యవేక్షించారు.కావాలంటే దీనిని ఇంకా ఘాటైన హెడ్డింగ్‌తో, పత్రికలో మొదటి పేజీకి సరిపోయేలా కూడా మార్చి ఇస్తాను.






## ప్రాచీన కట్టడాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రొఫెసర్ జి. సుకన్య

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

ప్రాచీన కట్టడాలు, చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య అన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన చారిత్రక కట్టడాల నమూనాలు, పోస్టర్లు, కళారూపాలను ప్రదర్శించారు. అయోధ్య రామ మందిరం, చార్మినార్, ఇండియా గేట్, ఈఫిల్ టవర్, పార్లమెంట్ భవనం తదితర నమూనాలను విద్యార్థులు ఆకర్షణీయంగా రూపొందించారు.

ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చరిత్ర, వారసత్వ సంపద, పర్యాటక రంగంపై అవగాహన పెంచుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అనంతరం హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన బందోబస్తులో సమర్థవంతమైన సేవలు

### టీ జి ఎస్ పి 10వ బెటాలియన్ సిబ్బందికి ఎస్పీ డి.జానకి అభినందనలు

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):



గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన టి జి ఎస్ పి 10వ బెటాలియన్, బీచ్‌పల్లి సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ అభినందించారు.

నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కార్యక్రమం ప్రశాంతంగా ముగియడానికి సహకరించారని ఎస్పీ పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

విధుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించిన ఎస్పీ.. రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా ముగియడానికి సహకరించిన టి జి ఎస్ పి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఎస్పీకి ఫిర్యాదు..

### చర్యలు తీసుకోవాలని కోరిన నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు..

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):



జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిపై రామన్ గౌడ్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్‌కు ఫిర్యాదు చేశారు.

నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తానేం సురేష్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి పిటిషన్ అందజేశారు. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులపై వ్యక్తిగతంగా, అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బంక వెంకటయ్య, రాంప్రసాద్, రాఘువీర్ శర్మ పంతులు, కార్యదర్శి దేవని ఆనంద్, రామ్‌సింగ్ తండా సర్పంచ్ అంబదాస్, ముంత నర్సింహులు, బంక అంజన్ యాదవ్, శంకర్, ఉపసర్పంచ్ మర్కంటి నర్సింహులు, అనుక్ శంకర్, డైరెక్టర్ బడికల మల్లేష్, రవి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఐలమ్మకు ఎస్పీ ఘన నివాళి

### అన్యాయంపై ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం: ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (వార్తా వేదిక సూర్య):

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎన్.బి. రత్నం, సురేష్ కుమార్, డీఎస్పీ రమణారెడ్డి, ఏఓ రుక్మిణీ భాయ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 129 || ఆదివారం సెప్టెంబర్, 27, 2026 ||



# యాదాద్రి భువనగిరి

## మల్కాపురం ప్రభుత్వ మిగులు భూమిని నిరుపేదలకు పంచాలి




**చౌటుప్పల్ సెప్టెంబర్ 25 వార్తా వేదిక సూర్య:** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 617, 114లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని మల్కాపురం గ్రామంలోని నిరుపేద ప్రజలకు పంపిణీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. జాంగిర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సిపిఎం చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం.డి. జాంగిర్ హాజరై మాట్లాడుతూ, మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని గుర్తించి, భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని అన్నారు. గ్రామంలో భూమిలేని పేదలు అనేకమంది ఉన్నారని, వారికి జీవనాధారం కల్పించేందుకు ప్రభుత్వ మిగులు భూమిని పంపిణీ చేయడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, భూమి పంపిణీ ప్రక్రియను చేపట్టి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు బూరుగు కృష్ణారెడ్డి మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్ తడక మోహన్ మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ అంతటి అశోక్ మీసాల శీను కొంతం సుశీల చెరుకు లక్ష్మమ్మ కొండే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### బి స్మార్ట్ భువనగిరి పట్టణ అధ్యక్షుడిగా శౌరెడ్డి

## ప్రధాన కార్యదర్శిగా బెజవాడ క్లైమెంట్ ఎన్నిక



**భువనగిరి టౌన్ సెప్టెంబర్ 26, వార్త వేదిక సూర్య :** బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి స్మార్ట్) భువనగిరి పట్టణ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. బి స్మార్ట్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ప్రకటించారు. భువనగిరి పట్టణ అధ్యక్షుడిగా శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ కరస్పాండెంట్ గాదె శౌ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇండియన్ మిషన్ స్కూల్ ఇన్‌చార్జి బెజవాడ క్లైమెంట్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేసి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి స్మార్ట్ యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు తీగల జయలక్ష్మి, జిల్లా కోశాధికారి సింగిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి అబోతుల కీర్తి, సభ్యులు మిర్యాల విద్యాసాగర్, పగిడాల పురేందర్ రెడ్డి, నల్ల సత్యనారాయణ రెడ్డి, గోపాగోని రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ పాలనకు గుర్తుగా రక్తదాన శిబిరం



**మోటకొండూరు, సెప్టెంబర్ 26 (వార్త వేధిక సూర్య):-**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ అధినేతగా 25 వసంతాలు (13 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 12 ఏళ్లు భారత ప్రధానిగా) పూర్తి చేసుకున్న సందర్భంగా మోటకొండూరు మండల కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు భూమండ్ల సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంఆర్వో రాజేంద్రప్రసాద్, ఎస్సై కుమారస్వామి యాదవ్, ఆర్ఐ రామారావు హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్లంల శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు, మండల పదాధికారులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# బహుజనుల రాజ్యాధికారంతోనే సామాజిక న్యాయం సాధ్యం

**చౌటుప్పల్ సెప్టెంబర్ 25**
**వార్తా వేదిక సూర్య**





బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక, భూస్వామ్య పీడనపై పిడికిలెత్తి గర్జించిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని, బహుజనులు తమ రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని బీసీవై పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ చిలకల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములు, పెత్తందార్ల గడీల అహంకారాన్ని గడగడలాడించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యాన్ని, తిరుగుబాటు చైతన్యాన్ని నింపిన ఐలమ్మ నేటి తరానికి ఆదర్శప్రాయురాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బహుజన వర్గాలు లక్షలాదిగా ఉన్నప్పటికీ చట్టసభలలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మన తరపున మాట్లాడే గొంతుకలు శాసనసభ, పార్లమెంట్‌లలో లేకపోతే భవిష్యత్తులో బానిసలుగా బతకాల్సి వస్తుందని హెచ్చరించారు. వెనుకబడిన వర్గాల సంక్షేమ పథకాలను, పదవులను, హక్కులను పెట్టుబడిదారీ, పెత్తందారీ వర్గాలు కొల్లగొడుతున్నాయని చిలకల శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. పాలకులు మారినా పేద కుటుంబాల జీవితాల్లో ఎలాంటి సమూల మార్పు రాలేదని, బహుజన బిడ్డలు రాజకీయంగా నాయకత్వం వహించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బహుజనులు ముందువరసలో నిలవాలని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు ఎండి జావేద్, సర్వాలే శ్రీనివాస్, ఆడెపు భిక్షపతి, మారుతి వికాస్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, గౌరవ అధ్యక్షులు బొల్లారం లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సామకూర యాదయ్య, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మలిగే బాలకృష్ణ, మలిగే నరసింహ, మండల ఉపాధ్యక్షులు ముదిగొండ వెంకటేశం, కానుగు శివకుమార్, పెదగంటి లింగస్వామి, రజక చౌటుప్పల్ పట్టణ కమిటీ అధ్యక్షులు మలిగే జంగయ్య, మలిగే కృష్ణ, కానుగు శేఖర్, మలిగే శ్రీను, మలిగే చంద్రయ్య, బాతరాజు యాదయ్య, మలిగే శంకర్, రావుల ముత్యాలు, ఎలకరాజు అంజయ్య, బాతరాజు వెంకటేశం, గరిసె నరసింహ, బాతరాజు అశోక్, మలిగే ఫకీర్, మలిగే రాజు, మలిగే రమేష్, మలిగే గాలయ్య, మలిగే కుమార్, మలిగే యశ్వంత్ మరియు చౌటుప్పల్ మండల రజక, బహుజన సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి

**- సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్**





**చౌటుప్పల్ సెప్టెంబర్ 26 : వార్తా వేదిక సూర్య**

రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్డు రైతు వేదిక వద్ద ఒకటవ వార్డు కౌన్సిలర్ కొనసం రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్, వైస్ చైర్మన్ పర్నే శివారెడ్డి, డైరెక్టర్ సురుకంటి లక్ష్మమ్మ యాదిరెడ్డి ని శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ మాట్లాడుతూ..రైతుల సంక్షేమం వారి ఆర్థిక పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడమే తమ సంఘం ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చౌటుప్పల్ మండలంలోని గ్రామాలను పిలాయిపపల్లి కాలువతో సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తా అన్నారు. . పిల్లాయిపల్లి కాలువకు మరమ్మత్తులు చేయించి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని తెలిపారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టి భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఘనంగా సన్మానించిన కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ కొరగోని లింగస్వామి, బండమీది మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊదరి నరసింహ, దోనకొండ కృష్ణ, నల్ల గణేష్ యాదవ్, ఉడత నరసింహ, బోరెం శేఖర్ రెడ్డి, మారుపాకల స్వామి, మట్టపల్లి శ్రీశైలం, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## దత్తాయి పల్లి గ్రామంలో వినాయకుని నిమజ్జనం



**తుర్కపల్లి, సెప్టెంబర్ 26, (వార్త వేదిక సూర్య):** దత్తాయి పల్లి గ్రామంలో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాధుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా తుర్కపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గణనాథుడు గ్రామ ప్రజలందరినీ చల్లగా చూడాలని గ్రామంలో ఎలాంటి దృష్ట శక్తులు రాకుండా గ్రామాన్ని కాపాడాలని గణనాధుని ఆశీర్వాదాలు ఎప్పుడు మా గ్రామ ప్రజలపై ఉండాలని కోరడం జరిగింది శ్రీరామ్ యూత్ కమిటీ వెంకటేష్ గౌడ్ సన్మానించడం జరిగింది కార్యక్రమంలో యూత్ సభ్యులు, మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## ప్రభుత్వ పాఠశాలకు టీవీని బహుకరించడం అభినందనీయం



**తుర్కపల్లి ,సెప్టెంబర్ 26(వార్త వేదిక సూర్య)**

ప్రభుత్వ పాఠశాలకు టీవీని బహుకరించడం అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం బాబులు నాయక్ తండ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు మమతా శ్రీనివాస్ 15 వేల రూపాయల విలువ గల టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు సహకరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి బోధన అందించి ఉన్నత శిఖరాలకు అధిరోహించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి ప్రశాంత్ ,సి ఆర్ పి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు

## ఆత్మకూరు మండలంలో ఘనంగా "పోషణ మాసం"

**ఆత్మకూరు (ఎం), సెప్టెంబర్ 26,**
**(వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో "పోషణ మాసం" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతిరోజూ ఆకుకూరలు, గుడ్లు, పాలు, క్యారెట్ మరియు అన్ని రకాల కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. వీటిలో అధిక పోషక పదార్థాలు ఉంటాయని, ఇవి తల్లులకు మరియు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు శిశు సంక్షేమ శాఖాధికారి వి.నాజీ, పర్యవేక్షకులు, సమాజ ఆరోగ్య అధికారి, ఆరోగ్య సందర్శకులు, సహాయ పథక అధికారి, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, ఆయాలు మరియు తల్లులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం..

**చింతలబస్తీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ**



**ఆలేరు:సెప్టెంబర్ 26(వార్త వేదిక సూర్య):** ఆలేరు పట్టణంలోని చింతలబస్తీలో చింతలబస్తీ శ్రీ సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి, కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నదానం భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సేవా కార్యక్రమాల్లో ఒకటిగా భావిస్తారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ద్వారా మానవత్వం, సేవాభావం, సామాజిక ఐక్యతను పెంపొందించవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. అన్నదానం కేవలం ఆహారం అందించే కార్యక్రమం మాత్రమే కాకుండా, అవసరంలో ఉన్నవారిని ఆదుకునే మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి, కౌన్సిలర్లు, చింతలబస్తీ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిసింది.

## మోటకొండూరులో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**ట్యాంక్‌బండ్‌పై విగ్రహం నెలకొల్పాలని డిమాండ్**
**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ కుమారస్వామి యాదవ్**
**కేక్ కట్ చేసి పూలమాలతో ఘనంగా నివాళులు**

**మోటకొండూరు ,సెప్టెంబర్ 26 (వార్త వేధిక సూర్య):-**



మోటకొండూరు మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై కుమారస్వామి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తమ రజక సామాజిక వర్గాన్ని బీసీ నుంచి ఎస్సీ జాబితాలో చేర్చాలని, కమ్యూనిటీకి సంబంధించిన ఇతర న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు వడ్డేబోయిన జహంగీర్, జంగపల్లి రాజయ్య, వడ్డేబోయిన వెంకటేష్, కృష్ణ, నారోజు నాగులు, శ్రీను, రాజు, శ్రీనివాస్, నారపల్లి నర్సింహులు, వడ్డేబోయిన రాజయ్య, పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**